

సింగరాజుపల్లిలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


## ఖాళీ అవుతున్న ప్రతిపక్ష పార్టీలు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

దేవరుప్పుల, అక్టోబర్ 16: తెలంగాణలో జనరంజక పాలన చూసి పలు పార్టీల శ్రేణులు బీఆర్ఎస్‌లో చేరుతుండగా ప్రతిపక్ష పార్టీలు ఖాళీ అవుతున్నాయని పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో సోమవారం పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ చెందిన 10 మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పారు. అలాగే కామారెడ్డిగూడెంకు చెందిన కాంగ్రెస్ యువజన నాయకుడు మొలుగూరి ప్రశాంత్ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను పాలకుర్తి నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు మెచ్చేలా అభివృద్ధి చేశానని అన్నారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు. మరోసారి ప్రజలు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. కాగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో జాటోత్ సాయి, పల్లపు యాదగిరి, జాటోత్ వీరన్న, అజ్మీరా రాజు, పల్లపు లింగయ్య, ధరావత్ రాజు, బత్తిని పరశురాములు, జాటోత్ వెంకన్న, బత్తిని భిక్షపతి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, సర్పంచ్ గోపాల్దాస్ మల్లేశ్, మండల నాయకులు పల్లా సుందర రాంరెడ్డి, విక్రంరెడ్డి, బస్వ మల్లేశ్, చింత రవి, కే జలంధర్‌రెడ్డి, జోగు సోమనర్సయ్య, వంగ అర్జున్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకపోతుల నర్సింహులు, రచ్చ ఎల్లప్ప, జాటోత్ మోహన్ నాయక్, సోమరాజ్, మేడ రాజు, బిళ్ల యాదవరెడ్డి, మేడ విద్యాసాగర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీదేవి అవతారంలో అమ్మవారు

పాలకుర్తి, అక్టోబర్16: లక్ష్మీనరసింహస్వామి క్షీరగిరి క్షేత్రం, మండలంలోని పలు గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు సోమేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమచ్చారు. అలాగే చండీహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు ←

## ‘పర్యాటక ప్రదేశాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యం భేష్’

పాలకుర్తి, అక్టోబర్16 : సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారని పద్యకవి పరావస్తు చిన్నయసూరి సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ వైష్ణవ వెంకట రమణామూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మహాకవి పాల్కురికీ సోమనాథుడిని దర్శించుకున్నారు. తాను రాసిన పద్య కావ్యం ‘నాయనారుల చరిత్ర’ ప్రచురణ, ఆశీస్సుల కోసం నంద్యాల నుంచి పాలకుర్తికి వచ్చినట్లు తెలిపారు. సోమేశ్వరస్వామికి పూజలు చేసిన ఆనంతరం కావ్య రాతప్రతిని సోమనాథుడి పాదాల చెంత ఉంచినట్లు తెలిపారు. సోమనాథుడి భారీ విగ్రహాన్ని చూసి విస్మయానికి గురయ్యానని కవుల జన్మస్థలాలను పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. సోమనాథుడు, బమ్మెర పోతన, వాల్మీకి జన్మస్థలం వల్మిడి వంటి మహాకవుల జన్మస్థలాలను పర్యాటక కేంద్రాలుగా ప్రభుత్వం తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు.



సోమనాథుడిని సందర్శించిన కవి వెంకటరమణమూర్తి




### చెప్పుకోండి

1. తెహ్రీ డ్యామ్‌ను ఏ నదిపై నిర్మించారు?
2. జార్ఖండ్ రాజధాని ఏది?
3. భారతదేశపు తొలి మహిళా గవర్నర్ ఎవరు?



## చిలుక నేర్పిన పాఠం

కథ



**ఒక** అడవిలో రామచిలుక – కోతి స్నేహంగా ఉండేవి. రామచిలుక తెలివైనది. కోతికి లోకజ్ఞానం తక్కువ. ఒక రోజున చిలుక నేరేడు చెట్టు మీద కూర్చుని పండ్లు తింటున్నది. కోతేమో పక్కనున్న చెట్టుమీద గంతులు వేస్తూ సీతాఫలాలు ఆరగిస్తున్నది. ఇంతలో కింద కాలిబాట మీద ఓ వ్యక్తి నడుస్తూ వెళ్తున్నాడు. చిలుక ఒక నేరేడు పండు కోసి అతని మీదికి విసిరేసింది. పండు మీద పడగానే అతను ఉలిక్కిపడి పైకి చూశాడు. చిలుక నవ్వుతూ.. ‘‘హాయిగా పండు తిను మిత్రమా!’’ అన్నది. దాని ముద్దు మాటలకు సంతోషించిన బాటసారి ఆ పండు తిన్నాడు. ‘‘ఇంకో రెండు తింటావా?’’ అంటూ చిలుక మరో రెండు పండ్లు పడేసింది. బాటసారి అవి కూడా తిని.. ‘‘నీకు దేవుడు మేలు చేస్తాడు!’’ అని ఆశీర్వదించి వెళ్లిపోయాడు. చిలుక చేసిన పనిని కోతి ఆశ్చర్యంగా చూసింది. ‘‘అతనికి పండ్లు ఎందుకిచ్చావు?’’ అని అడిగింది.

‘‘మన దగ్గరున్న దాంట్లో ఇతరులకు సహాయం చేస్తే.. వాళ్లు మనకు ఆశీర్వాదం ఇస్తారు. దేవుడు మనకు మేలు చేస్తాడు’’ అని చెప్పింది చిలుక. కోతి కూడా ఇకనుంచి అలాగే చేయాలని నిర్ణయించుకుంది. మర్నాడు అదే దారిన ఓ బాటసారి వెళ్తుంటే.. ఒక బాగా పండిన సీతాఫలాన్ని అతని మీదికి విసిరేసింది కోతి. ఉలిక్కిపడి పైకి చూశాడతను. కోతి పళ్లు ఇకిలించింది. అతని తల, బట్టల మీద చితికిపోయిన సీతాఫలం గుజ్జు, విత్తనాలు పడి.. అతని దుస్తులన్నీ చెడిపోయాయి. అతను కోపంగా కోతి వంక చూసేసరికి.. ఇంకోటి కావాలనుకుంటున్నాడని మరోపండు విసరబోయింది. వెంటనే బాటసారి ఓ రాయి తీసి కోతిపైకి విసిరాడు. అది భయపడి పారిపోయింది. ‘చిలుకను ఆశీర్వదించిన మనుషులు నన్నెందుకు రాళ్లతో కొడుతున్నారు?’ అనుకున్నది కోతి. ‘చిన్న నేరేడు పండుకే చిలుకను దీవించారు. ఇంకా పెద్ద పండు ఇస్తే నన్ను బాగా పొగుడుతారు!’ అనుకున్నది.

మర్నాడు కోతి మరో చెట్టు మీద కూర్చుని ఉంది. ఆ సమయంలో కాలిబాట మీద ఇద్దరు మిత్రులు కబుర్లు చెప్పుకొంటూ పోతున్నారు. వెంటనే తను కూర్చున్న చెట్టు పండును తెంపి వారి మీద పడేసింది కోతి. ఆ కాయ ఎవరి మీద పడిందో.. ఆ మనిషి కాస్తా మూర్ఛపోయాడు. రెండోవాడు తలెత్తి చూస్తే చెట్టుమీద కోతి కనిపించింది. దాంతో వాడు కోపంతో చేతిలో ఉన్న కర్రను కోతి మీదికి బలంగా విసిరాడు. ‘పెద్దపండు ఇచ్చినా కూడా ఈ మనుషులకు కృతజ్ఞత లేదు.. నన్ను రాళ్లతో, కర్రలతో కొడుతున్నారు?’ అనుకుని చిలుక దగ్గరికి వెళ్లి, తన సందేహం వెల్లడించింది. ‘‘ఇంతకూ ఆ మనుషుల మీద ఏ పండు పడేశావు?’’ అని అడిగింది చిలుక. ‘‘పెద్ద పండు పడేస్తే మనుషులు ఆనందిస్తారని.. తాటిపండు పడేశాను.. అంతే!’’ అన్నది కోతి అమాయకంగా. దాంతో చిలుక పగలబడి నవ్వింది. ‘‘మిత్రమా! పెద్ద పండు వేస్తే వాళ్ల తల పగిలిపోతుంది. పండిపోయిన సీతాఫలం వేస్తే ఆ బాటసారి దుస్తులు ఖరాబయ్యాయి కదా! అందుకే వాళ్లకు కోపం వచ్చింది. నువ్వు నేరేడు, ద్రాక్ష, వంటి చిన్న పండ్లు వేస్తే వాళ్లకు దెబ్బలు తగలవు. పైగా నిన్ను మెచ్చుకుంటారు’’ అని చెప్పింది. అప్పటికి గానీ కోతికి తన తప్పేంటో తెలియలేదు.

**నీతి :** ఇతరులకు మేలు చేస్తున్నాం అనుకుంటూ.. వారికి హాని చేయకూడదు’

- చంద్రప్రతాప్ కంతేటి

### ఆ పదమేంటి?

ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.




జవాబులు

జవాబులు : 1. భగీరథి, 2. రాంచీ, 3. సరోజినీ నాయుడు
ఆ పదమేంటి? : quail

### లిటిల్ హ్యాండ్స్

అడ్ల వసుంధర






### పదసృష్టి

కింది పదంలోని అక్షరాలతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Below

Ex : Low



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా:
zindagi@ntnews.com

### తేడాలు కనిపెట్టండి

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 7 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి

